

# కథ

రామవరపు వేణుగోపాలరావు.

ఆరోజు సాయంత్రం నేనూ, మూర్తీ కథల్రావుగారి ఎయిర్ కండిషండ్ గదిలో కూర్చున్నాం. ఆ కూర్చోడం కూడా ఊరికే గోళ్ళు గిల్లుకుంటూ కాదు. శేఖరం వస్తాడేమోనని ఎదురు చూస్తున్నాం. నాకూ, మూర్తికీ కథలంటే ఇష్టం. కథల్రావుగారికి కథలు సంపాదించడం ఇష్టం పత్రికా సంపాదకుడు గనక. శేఖరంకి కథల్చెప్పడం ఇష్టం. మేం నలుగురం ఎయిర్ కండిషండ్ గదిలో కూర్చున్నామంటే ఆ గది మరో గంటకి కథల్తో వేడెక్కిపోతుంది.

కథల్రావుగారి అసలు పేరు భూపాలరావు. అచ్చుకాని కథలు సంపాదించి అచ్చు వేస్తుంటాడు గాబట్టి మేం ఆయనకి ఆ పేరు పెట్టాం. కథల్రావుగారి అఫీసు గదిలో అన్నీ ప్రేమ కథలే వుంటాయి. మరికొన్ని ఆకలికవిత్వాలూ. నాకూ మూర్తికీ అవంటే యిప్పుడు చాలా విసుగ్గా వుంది. జరగని కథల కన్నా, జరిగిన కథలు వినాలని మా యిద్దరికీ వుంది. అందుకే శేఖరం ఎప్పుడొస్తాడా అని ఎదురు చూస్తున్నాం. కథల్రావుగారిక్కూడా ఆ ప్రేమకథలంటే అట్టే ఇష్టం వుండదు అని ఆయన మాతో అంటారు. కాని వాళ్ల పత్రిక చదివేవాళ్లు అందరూ కుర్రకారేనట. అందుకే ఆయనకి ఇష్టం లేకపోయినా,

ఆ ప్రేమకథలు అందమైన అమ్మాయిల బొమ్మల్తో సహా అచ్చేస్తూ వుంటారు.

నాకూ మూర్తికీ కథ్రలావు గారంటే అభిమానం. ఆయనా మేమంటే అభిమానిస్తాడు. పెద్దపెద్ద రచయితలురాసిన కథలగ్గిరినుంచి చిన్న చిన్న పాఠకులు రాసిన ఉత్తరాలదాకా అన్నీ ఆయన మాకు చూపిస్తూ వుంటారు. కొన్నినవ్వు తెప్పిస్తే కొన్నిమాకు ఏడ్పు తెప్పిస్తాయి. ఈ విచిత్రానుభూతికోసమే రోజూ సాయంకాలం ఓ గంట ఆయనగ్గరికి వెళ్తాం.

శేఖరం రచయిత కాడు. కాని, అతనికెన్నోకథలు తెలుసు ఎన్నోకథలు చూసిన కథ్రలావు కన్నా ఎన్నోకథలు చదివిన మాకన్నా అతనికి చాలా కథ తెల్సు. తల్చుకుంటే అతను రోజుకో నిజమైన కథ చెప్తాడు.

కథ్రలావుగారు కుర్చీ వెనక్కి చేరగిల బడి సిగరెట్లు ముట్టించారు. టిన్నుని మా ముందుకి తోస్తే మేమూ ఓ రెండు వెలిగించేం. ఇంతలో తలుపు చప్పుడైంది. అనుకున్నట్టుగానే శేఖరం వచ్చేడు.

"గుడీవెనింగ్ జానీ! నీకోసం చాలా సేపాయి చూస్తున్నాం." అన్నాడు మూర్తి.

"కథ్రలావుగారు క్షమించవలెను. ఓ పెద్దకేసు చూసి వస్తున్నాను. అందుకే ఆలస్యం అయింది."

కథ్రలావుగారు క్షమించిన పిదప శేఖరం కుర్చీలో కూర్చున్నాడు. కూర్చున్న శేఖరం మా ముగ్గురి ముఖాలు పరీక్షగా చూసి, ఏమిటీ విశేషం? అన్నాడు.

"కథ్రలావు గారికి ఏదైనా మంచికథ వినాలనుంది. యేం(వండి?" అన్నాను కథ్రలావుగార్ని చూస్తూ.

ఏదో ఆలోచిస్తున్న కథ్రలావుగారు అవునౌను అన్నారు.

శేఖరం మొహాన్ని సీరియస్‌గా పెట్టేడు. అంటే అతను కథ చెప్పే మూడ్‌లో లేడు. లేదా అతను చెప్పబోయే కథ మాకు నచ్చదు. సాధారణంగా అలాంటి సమయాల్లోనే అతని మొహం అలా మార్తుంది.

"ఏం మిత్రమా, కథ చెప్పే మూడ్ రావటం లేదా?" అన్నాను.

"అదేం కాదు గానీ – మీకో కథ చెప్తాను. ముగింపు మీరూహించుకోవాలి. ఏం – చెప్పమన్నారా?

"చెప్పండి."

"చెప్పు జానీ"

"అంతకన్నానా?"

— అని మేం ముగ్గురం అన్నాక శేఖరం ఈ విధంగా కథ చెప్పడం మొదలెట్టాడు.

నేన్నా జన్మలో ఎంతమందో అందమైన అమ్మాయిల్ని చూశాను. అంద్రీన్ని పెళ్ళి చేసుకోవాలనీ, ప్రేమించేయాలనీ అనుకోలేదు. కానీ ఆ అమ్మాయిని చూసిన మరుక్షణాన అంతపనీ చెయ్యాలన్న తీవ్రమైన కోరిక కలిగింది. ఆ అమ్మాయి పేరు సుకుమారి. పేరుకి తగ్గట్టు సుకుమారంగా స్వల్పంగా వుంటుంది. ఎమ్మేస్సీ చదువుకుంది. అంతగా చదువుకున్న ఏ అమ్మాయి

లోనూ వుందని అణుకువ ఆమెలోవుంది. అదే బహుశా నన్ను అకర్షించివుండాలి.

ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోడానికి ఒప్పుకున్నానన్న సంగతి విని ఇంట్లో అమ్మ ఆశ్చర్యపోయింది. వదిన వేళా కోళం ఆడింది. తోటి స్టూడెంట్సందరూ తాటాకులు కట్టి ఆడి చేసు. 'నీ లాంటి వస్తాదు ఆ అర్భకపు అమ్మాయిని మిసెస్‌గా చేసుకోవడం మగ జాతికే డిస్‌గ్రేస్ ! అన్నా రెందరో.

కాని ఎందుకో ఆ అమ్మాయిని ఒదులుకోడం నా కిష్టం లేకపోయింది. ఆ తర్వాత ఓసారి ఏదో కాలేజి ఫంక్షన్‌లో ఆ అమ్మాయి డాన్స్ చేసింది. కర్ణాటక సంగీతమన్నా — క్లాసికల్ డాన్సన్నా నాకు తలనొప్పి. పాకిస్తాన్ వాడు మన దేశం ఆక్రమించేస్తున్నట్టు బాధపడ్డాను. కాని, ఆరోజు— ఆ డాన్స్ చూశాక నాలోని 'హేట్రెడ్' అంతా మాయమైంది. ఒంటిమీద తెలివిలేకుండా కళ్ళప్పగించి ఆమె అవయవ సౌష్ట వాన్నీ, వివిధ రకాలయిన ముఖ భంగి మల్నీ అందమై. అంగ విన్యాసాన్నీ చూశాను.

ఆ అమ్మాయిని తప్పకుండా పెళ్ళి చేసు కోవాలని నిర్ణయించు కున్నాను. నాన్నగారికీ అమ్మకీ చెప్పేశాను. ఫ్రెండ్సుసర్కిల్లోకూడా విషయం స్పష్టం చేశాను. చైనావాళ్ల పీస్ పాలిసీ అనుస రిస్తున్నంత సంచలనం చెలరేగింది. ఇండియా అమెరికామీద వార్ డిక్లేర్ చేస్తే — కలిగే అలజడి వొచ్చింది

నాన్నగారూ వాళ్ళూ తాంబూలాలు పుచ్చేసుకున్నారు. లగ్నాలుకూడా పెట్టిం చేశారు. కాలేజీలోనూ, ప్లేగ్రౌండ్‌లోనూ తప్ప ఇంకెక్కడా దొరకని నేను విధిగా సుకుమారియింట్లోదొరికేవాడిని. సాయం కాలం అయిందంటే సుకుమారివాళ్ళ యింట్లోతప్ప యింకెక్కడా వుండనని నాపరిచయస్థులు బాగానమ్మేవారు. నిజ మంతే.

మూడుముళ్ళూపడ్డానికి ఇంకామూడు నెలలు వ్యవధివుంది. ఇద్దరం ఆ శుభ ఘడియలకోసం చూస్తున్నాం.

సుకుమారి హాబీలన్నీ నాకు చాలా ప్రియమైనవి. తప్పనిసరిగా ఫిలింఫేర్, స్పోర్ట్సు పాస్టయిమ్ మేగజీన్లు చదువు తుంది. 'ఫెమినా' మేగజిన్ ఏదీ మిస్స వదు. హిచ్‌కాక్‌పిక్చర్లంటే పడిచస్తుంది. సొఫియాలోరెన్‌అంటే నాకెంతయిష్టమో ఆమెకీ అంతే. గోల్డుఫ్లేక్ సిగరెట్టు తాగడం నాకిష్టం. గోల్డుఫ్లేక్ సిగరెట్లు నేను తాగడం ఆమె కిష్టం. టెర్లిన్ క్లోదింగ్ నాకులాగే ఆమెకీ మహాప్రీతి.

ఇలా మా ఇష్టాలు అభిరుచులు ఒక్కలా తీర్చి దిదినట్టు జతపడ్డాయి.

పెళ్ళి ఇంకా నెల రోజులుందనగా సుకుమారి ఒక డాన్స్ ప్రోగ్రామ్‌కి ఒప్పు కుంది. మామూలుగానే ఆ రోజు సాయం కాలం వాళ్ళింటికి వెళ్ళేను. సుకుమారి వాళ్ళ పెంపుడు కుక్కతో ఆడుకుం టోంది. నన్ను చూడగానే — 'గెటౌట్ సీజర్' అని ముద్దుగా కుక్కని కసిరింది. కుక్క వెళ్ళిపోయింది.

ఆ రోజు సుకుమారిలో నాకు కన్పించిన అందాలు చెప్పేశక్తి నాకి ప్పుడు లేదు. లేత నీలంరంగు టెర్లిన్ చీర కట్టుకుంది. రోజ్ కలర్ జాకెట్టు.

గుండ్రటి ముఖంమీద పొడుగాటి ఎర్రని బొట్టు ఓ చేతికి రెండు గోల్డ్ బేంగిల్స్, మరో చేతికి చిన్నవాచి– ఇవన్నీ కలిసి ఆమె సౌందర్యగర్వాన్ని ఇనుమడింప చేస్తాయి. అందంతో ఆమె యెక్కిన శిఖరాల్ని నేనందు కోగల్నా అనిపించింది.

"రెడీయేనా?" అన్నాను.

"ఓ, గంట క్రితమే రెడీ!" అంది.

ఇద్దరం బయటికి నడిచాం. సాయంకాలం నీరెండలో మారిస్ మెనర్ కారు తళ తళ మెరుస్తోంది. డోర్ ఓపెన్ చేయగానే కూర్చుంది. డ్రయివింగ్ సీట్లో కూర్చున్నాను.

కాసేపయ్యాక ఇద్దరం ఓపెనెయిర్ థియేటర్ చేరుకున్నాం. మా ఇద్దర్నీ చాలామంది పెద్దవాళ్ళు రిసీవ్ చేసుకున్నారు. సుకుమారి నృత్యప్రదర్శన చూడ్డానికి వచ్చిన వాళ్ళల్లో ఒక సినిమా దర్శకుడూ, ఒక రాష్ట్రమంత్రీ వున్నారు. నేను వాళ్ళ సరసనే ఫ్రంటురోలోకూర్చున్నాను. అక్కడున్న ప్రేక్షకుల కళ్లన్నీ నామీదా సుకుమారి మీదే. వాటిల్లోని జలసీ చూసి నేను గర్వించాను.

తెర తొలగింది. సుకుమారి వేదిక యెక్కి సభాసదులకి వందనం చేసింది. శివపూజ ఐటమ్ సాగుతోంది. సుకుమారమైన కాళ్ళూ చేతులూ మెరుపుల్లా కదుల్తున్నయ్. సౌందర్యరేఖ నర్తిస్తున్నట్టుంది.

అలా ఆ ఆనందాన్ని రెండునిముషాల పాటు అనుభవించానేమో! ఆ తర్వాత సుకుమారి చప్పున వేదికపై పడిపోయింది. హాలంతా గగ్గోలు పెట్టింది. గబగబ కర్టెన్లు వేశారు.

గాభరాగా నేను స్టేజిలోపలికి వెళ్లేను. అప్పటికే ఎవరో యిద్దరు చుట్టూ చేరి ముఖంమీద నీళ్లు జల్లుతున్నారు. నేను దగ్గరగా వెళ్లి నేలమీద కూరు న్నాను. మెల్లగా సుకుమారీ! అని పిల్చేను. నెమ్మదిగా కళ్లు తెరిచింది. సారవిహీనంగా నవ్వింది. అస్పష్టంగా పెదాలు కదిలినయ్.

"ఏమైందిసుకుమారీ కళ్లుతిరిగాయా" అన్నాను.

తలాడించింది.

"ఇంటికి పోదామా?" అన్నాను.

"అలాగే" అని లేచింది. కాదు లేవడానికి ప్రయత్నించింది. మళ్లా పడిపోయింది.

"నా కాళ్లు...." అంది బాధగా.

నేను త్రుళ్లిపడ్డాను. భగవాన్ ఏమైంది? సుకుమారి కాళ్లు ఎమయ్యాయి?

"నా కాళ్లు పడి పోయాయి." అంది హీన స్వరంతో. క్షణం పిచ్చివాడినయ్యాను.

– ఆ తర్వాత ఆమెను ఎందరు డాక్టర్లకో చూపించాము. మెదడులో వాతం వుందనీ అందుకే కాళ్లు పడిపోయాయనీ అందరూ చెప్పారు. వాళ్లకీ వీళ్లకీ చూపించి కాల యాపన చేసేకన్నా వైద్యానికి విశాఖపట్నం తీసుకు పోవడం మంచిదని కొంతమంది సలహా యిచ్చేరు.

దాదాపు రెండు నెల్లు ఆమెకి ట్రీట్మెంటు ఇప్పించేం ఫలితం లభించలేదు. ఆ ఆశ కూడా నిరాశే అయింది.

'సర్జరీ' ద్వారా ఎదో మిరకిల్ జరుగు

తేనే తప్ప కాళ్ళు రావన్నారు డాక్టర్లు. కాని అందులో ప్రాణానికే ముప్పుతెచ్చే ప్రమాదముంది. ఒక్కగానొక్క పిల్లని చేజేతులా ఎవరొదులు కుంటారు ? తల్లి దండ్రులు అంగీకరించలేదు

* * *

'క్లుప్తంగా ఇదీ కథ!' అన్నాడు శేఖరం.

"ఆఖరి కేమయింది?" అన్నారు కథల్రావుగారు.

"మీరే చెప్పండి. ఎలా జరిగి వుంటుంది?" అని శేఖరం ఎదురుప్రశ్న వేశాడు.

"నే చెప్పనా ? శేఖరం గాడు ఫారిన్ వెళ్ళేడు అక్కడ ఏస్ సర్జన్‌గా ట్రెయినింగై ఇండియాకి తిరిగొచ్చేడు. సుకుమారికి ఆపరేషన్ చేశాడు. ఇంకేముంది ఆమె కాళ్ళు బాగయ్యేయి. సుకుమారీ, శేఖరం చిలకా గోరింకల్లా హాయిగా వున్నారు." అన్నాడు మూర్తి ఎన్నో ప్రేమకథలుచదివిన పరిజ్ఞానంతో

"నువ్ నార్మయ్యావోయ్ భడవా. మీరేం అంటారండీ కథల్రావుగారూ ?" అన్నాడు శేఖరం.

కథల్రావు గారు నిస్సహాయంగా కుర్చీలో కదిలేరు– "సారీ. నేను చెప్పలేను. కథయితే పోనీ ఏముందో వూహించవచ్చు. కానీ ఇది జీవితం. నేనెలా చెప్పగల్ను ?" అన్నారు.

"సరే నేనే చెప్తాను సుకుమారి వారాలు నెలలు ఆలోచించింది. ఆపరేషన్ చేయించుకోకపోతే శాశ్వతంగా తనకి అవిటి బ్రతుకు తప్పదు. ప్రతి పనికీ, ప్రతి కాలకృత్యానికీ తనకి ఎవరేనా సాయం చెయ్యాలి. అంటే రోజూ చస్తూ బ్రతకాలి. అంచేత ఆమె ఆపరేషన్‌కి సిద్ధపడింది. ఆపరేషన్ సక్సెస్ అయిందా తను మునుపటిలాగా మేగజీన్లు చదువుతుంది. చూసేవాళ్ళు ముగ్ధులయ్యేలా నాట్యం చేస్తుంది. అభిమానుల హృదయాలు పులకించేలా అద్భుతంగా నవ్వుతుంది. పట్టుదలగా టేబుల్ టెన్నిస్ ఆడుతుంది. అదృష్టం కలిసివస్తే అంతర్జాతీయ నర్తకి అవుతుంది. లేదా, రోజూ అనుభవించే మరణవేదనకి శాశ్వతంగా దూరమౌతుంది. నా అన్నవాళ్ళ కంటతడిని రోజూ చూసే దౌర్భాగ్యానికియోజనాల దూరం పారిపోతుంది అంచేతనే ఆమె ఆపరేషన్ చేయించుకోడానికి సిద్ధపడింది. తల్లి దండ్రుల్నీ నన్నూ బలవంతంగా ఒప్పించింది. గుండెరాయి చేసుకుని నేను 'ఊ' అన్నా. మనప్రజాపతి రావు లేడూ ఫారిన్ రిటర్న్‌డ్ ఆయన ఆపరేట్ చేశారు. అని ఆయాసంగా ఆగేడు శేఖరం.

"ఏముంది ఆవిడ బ్రతికిందా ?" అన్నానేను.

"కాళ్లొచ్చాయా ?" అన్నాడుమూర్తి.

"కథ బాగానే వుంది. ఇంతకీ ఏమైంది ?" అన్నారు కథల్రావుగారు.

"ఏమీ కాలేదు. ఆమె బ్రతికింది. కాళ్లొచ్చాయి. పూర్వంలా సుకుమారి పుస్తకాలుచదవలేదు. కాని చూడగలదు, మొదట్లోలా డాన్స్ చేయలేదుగాని చూసి ఆనందించగలదు."

"అంటే—?"

"అంటేనా సుకుమారికి పూర్వస్మృతి పోయింది. తల్లి దండ్రుల్నీ కాబోయే

భర్తని గూడా గుర్తుపట్టలేని స్థితిలో వుంది."

"పోనీలే — పూర్వంకన్నా నయమేగా!" అన్నాను.

"అదిసరే శేఖరం! ఈ కథచెప్పావ్ బాగానేవుంది అయితే యిందులో మనం తెలుసుకోవడానికి ఏంవున్నావుందా?" అన్నాడు మూర్తి పక్కా రంధ్రాన్వేషకుడిలాగ.

"ఎందుకులేదు? బోలెడంతవుంది. చావుకీ బ్రతుకీ మధ్యదూరం వూహించుకోవచ్చు. ఒకో అప్పుడు బ్రతుకన్నా చావెంత బాగుంటుందో వూహించుకోవచ్చు. జీవితంలో దెబ్బలు తినడానికి వెనుదీయకూడదనీ— అదిచ్చే దెబ్బల్నీ బహుమానాల్నీ సహనంగా స్వీకరించాలనీ తెలుసుకోవచ్చు. ఇవిచాలా?" అన్నాడు శేఖరం.

"అవుననుకో—" అంటూ యేదో ఆలోచనలో పడ్డాడు మూర్తి.

ఇంతలో టెలిఫోన్ మ్రోగింది. రిసీవరందుకున్నాను. అవతల సుకుమారి మాట్లాడుతోంది. క్షణంసేపు ఆశ్చర్యపోయాను. 'ఎవరు కావాలండీ?' అని అడిగేను. శేఖరం కావాలనగానే రిసీవర్ని అతనికి యిచ్చాను. శేఖరం ఫోన్లో దాదాపు పావుగంట మాట్లాడేడు. ఆఖరికి శేఖరం నవ్వుతూ టెలిఫోన్ పెట్టేశాడు.

"ఫూల్స్ అయ్యాం మేం. ఆవిడకి పూర్వస్మృతి లేదన్నావే?" అన్నాను.

"సారీ బాస్. అదొక్కటి తప్పించి మిగతాదంతా వాస్తవం" అంటూ జేబులోంచి మూడు కవర్లు తీసి ముగ్గురికీ యిచ్చాడు.

"ఇవిగో శుభలేఖలు. మీరందరూ మా వివాహానికి వచ్చి – సాక్షులవ్వాలి." అంటూ హడావుడిగా లేచి 'గుడ్నైట్' అని బయటికి వెళ్ళిపోయాడు.

"ఔరా!" అనుకుంటూ నా చేతిలో వున్న కవరు విప్పి చూశాను. గుడ్గాడ్! అందులో శుభలేఖ లేదు. కథ్రావూ, మూర్తీకూడా కవర్లు విప్పేరు. అందులోనూ లేవు.

ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నాం.

"ఈసారి శేఖరం చెప్పింది నిజమైన కథ గాదు." అన్నారు కథ్రావు.

"మరి టెలిఫోనెవరు చేశారు?" అన్నాను.

"శేఖరం గాడికి బోల్డుమంది గర్ల్‌ఫ్రెండ్స్ వున్నారు. ఎవరికి చెప్పినా చేస్తారు. లేదా నటిస్తారు" అన్నాడు మూర్తి.

ఆశ్చర్యపోవాలో నవ్వాలో ఏడ్వాలో తెలీక ఆ కంగారులో సిగరెట్టు మాత్రం వెలిగించాను. *